నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

8 | నిజామాబాద్ సోమవారం 13 మే 2024 | ADILABAD NIRMAL




ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మిషన్లు పంపిణీ చేస్తున్న అధికారులు



నిర్మల్ టౌన్ : డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# ఓటేద్దాం రండి..

## నేడే పార్లమెంట్ ఎన్నికలు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే ఓటింగ్
- కేంద్రాలకు పోలింగ్ సామగ్రి తరలింపు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికార యంత్రాంగం

మంచిర్యాల, మే 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు స్వరం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం సాయంత్రంతో ప్రచార పర్వానికి తెరపడిన నేపథ్యంలో.. నేడు(సోమవారం) పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 16,50,175 మంది, పెద్దపల్లి సెగ్మెంట్‌లో 15,96,430 మంది ఓటర్లు ఉన్నారు. వీరంగా నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ సామగ్రి, ఈవీఎంలను ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగింటిలో పోలింగ్ రెండు గంటల ముందుగానే పూర్తి కానున్నది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలుసహా మంథని నియోజకవర్గంలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోనూ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మిగిలిన నియోజవర్గాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉండనుంది. నిర్దేశిత సమయంలోపు వచ్చి లైన్‌లో నిలబడిన ఓటర్లందరూ ఓటు వేసేందుకు సమయం ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

### పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి ఆదివారం సాయంత్రానికే పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలుసహా నియోజకవర్గ కేంద్రం నుంచి సామగ్రిని, సిబ్బందిని అధికారులు పోలింగ్ నిర్వహించేందుకు వారికి కేటాయించిన కేంద్రాలకు వెళ్లారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో 2,197 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 802 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న సిబ్బంది



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని టీటీడీసీలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌లో చంటి పాపతో ఎలక్షన్ విధులకు వెళ్తున్న మహిళ

## ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్, మే 12 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఆదివారం అధికారులు పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. మెటీరియల్ తీసుకున్న సిబ్బంది మధ్యాహ్నం తర్వాత వాహనాల్లో తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. పంపిణీ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షా పరిశీలించారు. ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం విధులు నిర్వహించే సిబ్బందికి సూచనలు చేశారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాగా.. 2,200 పోలింగ్ కేంద్రాల పరిధిలో 10,548 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. వీరిలో పీవోలు 2637, ఏపీవోలు 2637, సిబ్బంది 5274 మంది ఉన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రవాణా పరమైన సమస్యలు తలెత్తకుండా ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో తాగునీరు, కూలర్స్, షామియానా, విద్యుత్, వీల్ చైర్స్ వంటి సౌకర్యాలు కల్పించారు. 249 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టారు. ఓటు వేసేందుకు వచ్చే ప్రజలు తమ పోలింగ్ స్లిప్‌తోపాటు ఆధార్, ఓటర్ ఐడీ, ఉపాధి హామీ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, లైబర్‌కార్డు, ఇతర గుర్తింపు కార్డులను తీసుకుని రావాలని అధికారులు సూచించారు. పోలింగ్ సందర్భంగా నేడు ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమల్లో పని చేసేవారికి వేతనంతో కూడిన సెలవును మంజూరు చేసింది. పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపర్చడానికి గదులను సిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



బోథ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో డీఎస్పీ, సీఐలకు సూచనలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం



బోథ్‌లో పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

## నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ టౌన్, మే 12 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి కేంద్రంలో వంద శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. నిర్మల్‌లోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 149 సమస్యాత్మక, నక్సల్ ప్రభావిత పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇక్కడ అదనపు పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్కో నమూనా పోలింగ్ కేంద్రం, మహిళా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో ఎన్నికల అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన సమాచార పోస్టర్లు ఉంచనున్నారు. ఇప్పటికే 97.81 శాతం ఓటరు గుర్తింపు స్లిప్పులు పంపిణీ పూర్తి చేశారు. 85 ఏండ్లు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని 636 మందికి హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించగా.. 609 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇప్పటివరకు సి-విజిల్ యాప్‌లో 14 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించారు. మే 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. ఈ సమయం తర్వాత ప్రచారాలు చేసినా కఠిన చర్యలు తీసుకోనున్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) వారి అనుమతితోనే మీడియా, వార్తా పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలి. ఎన్నికల వ్యయ అంచనా కమిటీలు పార్టీల వ్యయాలను అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ఎటువంటి అనుమతులు లేకుండా రూ.3.81 కోట్ల నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఓటింగ్ శాతం పెరగడానికి 5కే రన్, కళాజాత వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రంలో ఐదుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు. సమస్యత్మక కేంద్రాలపై నిఘా ఉంచారు.

### గ్రామాలకు తరలిన సిబ్బంది

నిర్మల్ పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఎన్నికల ప్రక్రియను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీంచారు. అనంతరం సిబ్బంది సామగ్రితో తమకు కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. ఈవీఎం, వీవీ ప్యాడ్స్‌లో సాంకేతిక లోపం ఉంటే వాటిని సరిచేసేందుకు టెక్నికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. రూట్, జోన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అత్యవసర విధుల కోసం ఎన్నికల సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచారు. ఈ ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

### 1,600 మంది పోలీసులతో బందోబస్తు

నిర్మల్ అర్బన్, మే 12 : ప్రశాంత వాతావరణం, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు శాఖ భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. 1,600 మంది పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అనుమతి లేకుండా సమావేశాలు, గుంపులుగా ఉండడానికి వీలులేదని పేర్కొన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి సారించి, పెట్రోలింగ్ ముమ్మరం చేశామని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన వారు కూడా స్థానికంగా ఉండడానికి వీలు లేదని, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో ఇతర ప్రాంతాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు ఉండకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అసత్య ప్రచారాలు, సమాజంలో అలజడులు సృష్టించే విధంగా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నిర్మల్ టౌన్ : డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రి వివరాలు చూసుకుంటూ..



నిర్మల్ టౌన్ : పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తూ..

### పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో..

| నియోజకవర్గం | పురుష ఓటర్లు | మహిళ ఓటర్లు | ట్రాన్స్ జెండర్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| చెన్నూర్ | 96,019 | 97,752 | 07 | 1,93,778 |
| బెల్లంపల్లి | 87,283 | 89,219 | 12 | 1,76,514 |
| మంచిర్యాల | 1,38,064 | 1,40,648 | 26 | 2,78,738 |
| ధర్మపురి | 1,12,442 | 1,18,338 | 06 | 2,30,786 |
| రామగుండం | 1,09,826 | 1,09,870 | 27 | 2,19,723 |
| మంథని | 1,17,352 | 1,23,329 | 18 | 2,39,699 |
| పెద్దపల్లి | 1,26,719 | 1,30,466 | 07 | 2,57,190 |
| మొత్తం | 7,87,705 | 8,08,622 | 103 | 15,96,430 |

### ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో..

| నియోజకవర్గం | పురుష ఓటర్లు | మహిళ ఓటర్లు | ట్రాన్స్ జెండర్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| సిర్పూర్ | 1,14,522 | 1,14,567 | 12 | 2,29,101 |
| ఆసిఫాబాద్ | 1,12,788 | 1,14,404 | 16 | 2,27,208 |
| ఖానాపూర్ | 1,09,685 | 1,14,825 | 13 | 2,24,523 |
| ఆదిలాబాద్ | 1,19,848 | 1,25,283 | 06 | 2,45,137 |
| బోథ్ | 1,02,458 | 1,08,852 | 03 | 2,11,313 |
| నిర్మల్ | 1,21,991 | 1,36,304 | 19 | 2,58,314 |
| ముథోల్ | 1,23,583 | 1,30,978 | 18 | 2,54,579 |
| మొత్తం | 8,04,875 | 8,45,213 | 87 | 16,50,179 |



పెంబిలో తడిసిన ధాన్యం



ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

# గాలివాన బీభత్సం

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షం
- పిడుగుపాటుకు ఒకరి మృతి.. పలువురికి గాయాలు
- గాలివానకు విరిగిన పడిన చెట్లు.. లేచిపోయిన ఇండ్ల పైకప్పులు
- బెల్లూరిలో తెగిన 33/11 కేవీ విద్యుత్ వైర్లు
- పరామర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్/తాంసి/ఉట్నూర్ రూరల్/పెంబి, మే 12 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. జైనథ్ మండలంలోని బెల్లూరి, బెల్లూరిగూడ, మాకోడ, భరోజ్, జైనథ్, నిరాల, గిమ్మ గ్రామాల్లో వర్షం కురిసింది. గిమ్మ గ్రామంలోని నర్సరీ పనులు వాటి పరిశీలనకు వెళ్లిన రైతు కూలీలు, నాయకులపై పిడుగు పడడంతో గ్రామానికి చెందిన మామిడిపెల్లి కిరణ్ (38) మృతి చెందాడు. కోల భోజన్న, కూరేల్లి టిల్లు, కొండ రమేశ్, మంగ సంటెన్న పిడుగుపాటుకు తీవ్ర గాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బెల్లూరిలో 33/11కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు విరిగి పడ్డాయి. పిడుగుపాటుకు గురైన వారిని మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. రిమ్స్ వైద్యులను ఆరోగ్య విషయం అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. పిడుగుపాటు గురైన వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు.

### భీంపూర్ మండలంలో..

ఇందూర్‌పల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా పెద్ద చెట్లు, హరిత హారం కింద నాటిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్లు విరిగిపడ్డాయి. ట్రాక్టర్ ట్రాలీ గాలికి లేచి పడింది. దీంతో ఆ వైపుగా ఆదిలాబాద్ నుంచి కరంజి(టీ)-కరంజి నుంచి ఆదిలాబాద్ వైపు వచ్చే ఆర్టీసీ, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. రోడ్డుకు అడ్డుగా పడిన చెట్లను స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు తొలిగించారు. అంతర్గాం, గుబిడి, కరంజి(టీ), గోముత్రి పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో రాళ్లవాన కురిసింది. అంతర్గాంలో పాండురంగ్‌కు చెందిన మోటార్ సైకిల్‌పై చెట్టు పడింది. కరంజి(టీ), అంతర్గాం, ధనోర గ్రామాల్లో జొన్న పంటకు కొంత నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

### ఉట్నూర్ మండలంలో..

మూడు రోజులుగా సాయంత్రం వర్షం కురుస్తుండడంతో వరి కోతలు నిలిచిపోయాయి. కోయడానికి సిద్ధంగా ఉన్న వరిపైరు నేలకొరిగింది. చేతికొచ్చిన పంట వర్షాలకు తడుస్తుండడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పెంబి మండలంలో..

పలు గ్రామాల్లో వర్షం కురిసింది. కల్లాలతోపాటు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఇందూర్‌పల్లిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు తొలగిస్తున్న స్థానికులు



గాలికి లేచిపడిన ట్రాక్టర్ ట్రాలీ



గిమ్మాలో పిడుగు పడి మృతిచెందిన కిరణ్



రిమ్స్‌లో బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## బీఆర్ఎస్ లో చేరిక

నేరడిగొండ, మే 12 : రేంగన్‌వాడీ, ఈస్పూర్ గ్రామాల ఆదివాసులు ఆత్రం సక్కు, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నేరడిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఆయా గ్రామాల ఆదివాసీ పటేళ్లు, 100 మంది మహిళలు, వివిధ పార్టీల నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవిందర్‌రెడ్డి, ఎంపీటీసీ అంబేకర్ పండరి, నాయకులు ఉప్పు పోశెట్టి, గులాబ్‌సింగ్, జాదవ్ గణేష్, భూషణ్, సుజిల్ పాల్గొన్నారు.



నేరడిగొండలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన వివిధ గ్రామాల ఆదివాసులు

## రేషన్ డీలర్‌పై నిరసన

పెంబి, మే 12 : మండలంలోని షెట్‌పల్లి రేషన్ డీలర్ మల్లేశ్ బియ్యం పంపిణీలో జాప్యం చేస్తుండడంతో ఆదివారం షాపు ఎదుట వినియోగదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు, మూడు రోజులకోసారి బియ్యం పంపిణీ చేస్తున్నాడని, తరువాత షాపుకు వెళ్తే అయిపోయాయని చెబుతున్నాడని ఆరోపించారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పంచపుల విచారణ జరిపారు. అవకతవలను గుర్తించి, డీలర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రేషన్ దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు